ప్రజాశక్తి
మంగళవారం 27 డిసెంబర్ 2022 8 పేజీలు

గుంటూరు పల్నాడు

నిలిచిన బూస్టర్ డోస్

గత జులై 18న పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోవిడ్ ప్రికాషనరీ డోస్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

పొంచి ఉన్న నాలుగో దశ కరోనా ముప్పు

వ్యాక్సినేషన్ పున: ప్రారంభం అయ్యేనా?

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కరోనా నాలుగో దశ వ్యాపించే అవకాశం ఉందని, అంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇటీవల కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. అయితే జిల్లాలో రెండు నెలలుగా కరోనా వ్యాక్సినేషన్ ప్రికాషనరీ (బూస్టర్) డోస్ ప్రక్రియ నిలిచింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 50 లక్షల జనాభా ఉండగా 18 ఏళ్ల పైబడిన వారు 30 లక్షల మంది ఉండగా నూరు శాతం వ్యాక్సినేషన్ జరిగినట్లు అధికారులు ప్రకటించారు. మొదటి, రెండు డోసుల ప్రక్రియ దాదాపు పూర్తయింది. 60 ఏళ్ల పైబడిన వారికి వ్యాక్సిన్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 7.5 లక్షల మంది ఉండగా 70 శాతం కూడా బూస్టర్ డోస్ ప్రక్రియ పూర్తయింది. 45 ఏళ్లు దాటిన వారు 30 లక్షల మందిలో మొదటి రెండు డోస్‌లు దాదాపుగా 95 శాతం పూర్తి కాగా బూస్టర్ డోస్ 50 శాతం పూర్తయింది. ఇంకా 50 శాతం మందికి బూస్టర్ డోస్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది.

ఇప్పటి వరకు హెల్త్ కేర్ వర్కర్స్, ఫ్రంట్ లైన్ వర్కర్స్, విదేశాలకు వెళ్లే వారికి, ఐదేళ్ల లోపు చిన్నారుల తల్లులకు, గర్భిణులకు, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు, జన బాహుళ్యమ్‌లో సంచరించే వారికి మూడు డోసుల వ్యాక్సినేషన్ దాదాపుగా పూర్తి చేశామని అధికారులు తెలిపారు. జిల్లాలో తిరిగి వ్యాక్సిన్ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభం అవుతుంది అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో బూస్టర్ డోస్ వేస్తామని ప్రకటనలు వస్తున్నాయి. అయితే కేంద్రం రాష్ట్రానికి బూస్టర్ డోస్‌కు కోటా కేటాయించ లేదని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

2020 మార్చి 25 నుంచి జిల్లాలో కరోనా కేసులు నమోదు ప్రారంభం కాగా ఈ ఏడాది ఆగస్ట్ వరకు కొనసాగాయి. మొదటి, రెండో దశ కరోనా కేసులు జిల్లా ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేశాయి. దాదాపు రెండు లక్షల ఐదు వేల కరోనా కేసులు నమోదయ్యాయి. అధికారికంగా మూడు వేల మంది చనిపోగా అనధికారికంగా 10 వేల మంది వరకు మృతి చెందారు. కరోనా తదనంతర ఆరోగ్య సమస్యల వల్ల ఎంతో మంది మత్యువాత పడ్డారు. కరోనా తదనంతర

30న కాజాకు భారత ప్రధాన న్యాయమూర్తి

- జ్యుడీషియల్ అకాడమిని ప్రారంభించనున్న జస్టిస్ డివై చంద్రచూడ్
- అనంతరం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కార్యక్రమానికి హాజరు
- ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు

మంగళగిరి మండలం కాజా వద్ద జ్యుడీషియల్ అకాడమి ప్రారంభోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై.చంద్రచూడ్ ఈ నెల 30వ తేదీన రానున్న నేపథ్యంలో కార్యక్రమ విజయవంతానికి అధికారులంతా సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కోరారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పర్యటనపై కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్షించారు. 30వ తేది ఉదయం విజయవాడ నుండి కాజాకు వస్తారని, అక్కడ జ్యుడిషియల్ అకాడమి ప్రారంభానంతరం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. చీఫ్ జస్టిస్ పర్యటనకు సంబంధించి వివిధ శాఖల అధికారులకు ఇప్పటికే విధులు కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చామన్నారు. పర్యటనలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జెసి రాజకుమారి, డిప్యూటీ కలెక్టర్లు లలిత, భాస్కరనాయుడు, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు హరిహరనాథ్, యుగంధర్‌కుమార్, ఉద్యాన శాఖ డీడీ సుజాత, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, డిఇఒ శైలజ, డిఎస్ఒ పద్మశ్రీ, డిపిపి కేశవరెడ్డి, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ సుమయాఖాన్ పాల్గొన్నారు.

మంగళగిరిలో నిరసన తెలుపుతున్న నాయకులు

చెత్త పన్ను రద్దు చేయాలి

వార్త మెయిన్‌లో

అన్ని విలేజ్ క్లినిక్‌లలో కోవిడ్ పరీక్షలు

పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శోభారాణి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

తాజా పరిస్థితుల నేపథ్యంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రతి విలేజ్ క్లినిక్ లోనూ కోవిడ్ పరీక్షలు చేయనున్నట్లు పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శోభారాణి సోమవారం ప్రకటించారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో పాజిటివ్‌లు ఏమీ నమోదు కాలేదని, అయినా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గుంపులుగా చేరొద్దని, చేతులు తరచూ శుభ్రం చేసుకోవాలని, మాస్కులు ధరించాలని చెప్పారు. అందరూ కోవిడ్ టీకాలు తీసుకోవడంతోపాటు రెండు డోసులు తీసుకున్న వారు ప్రికాషనరీ డోసుకూడా తప్పకుండా తీసుకోవాలన్నారు. కోవిడ్ నిబంధనలను పాటించడంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, 65 ఏళ్లు దాటిన వారు, గర్భిణులు, బాలింతలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికైనా అనుమానం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

రాజధాని పారిశుధ్య కార్మికులను కొనసాగించాలి

సిఆర్‌డిఎ కమిషనర్‌కు ఎంఎల్‌సి లక్ష్మణరావు, సిపిఎం నేత బాబూరావు వినతి

ప్రజాశక్తి - విజయవాడ

రాజధాని పారిశుధ్య కార్మికులను జనవరి నుండి పనిలో కొనసాగించాలని, వారికి పని భద్రత కల్పించాలని, ఉద్యోగులనే పేరుతో తొలగించిన రాజధాని సామాజిక పింఛనును పునరుద్ధరించాలని కోరుతూ సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్‌కు పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి వినతిపత్రం సమర్పించారు. విజయవాడలోని సిఆర్‌డిఎ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ వివేక్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ టెండరు కాలం డిసెంబర్ నాటికి ముగియనున్న నేపథ్యంలో కొత్తగా టెండరు పిలిచి రాజధానిలోని 29 గ్రామాల్లో 2017 నుండి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను జనవరి నుండి యథావిధిగా కొనసాగించాలని కోరారు. పారిశుధ్య కార్మికులను పని నుండి నిలుపుదల చేస్తే వారి ఉపాధి పోయి నిరుపేదలైన వారి కుటుంబాలు రోడ్డు పాలవుతాయని చెప్పారు. రాజధాని గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంటుందన్నారు. ప్రభుత్వం నుండి నిధులు వచ్చేలా కృషి చేసి కార్మికులకు పని భద్రత కల్పించాలని విన్నవించారు. కార్మికుల పోరాట ఫలితంగా అధికారులు హామీ ఇచ్చిన విధంగా డిసెంబర్ 23 నాటికి రాజధాని పారిశుధ్య కార్మికుల జీతాలు మొత్తం చెల్లించినందుకు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సిఆర్‌డిఎ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న కె.ఎస్.లక్ష్మణరావు, సిహెచ్ బాబురావు, ఎం.రవి

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధత

మాక్ డ్రిల్ నిర్వహణపై గుంటూరు జిల్లా కలెక్టర్ సమీక్ష

ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

8లో

నిలిచిన బూస్టర్ డోస్

(మొదటి పేజీ తరువాయి)

సమస్యల వల్ల ఇప్పటికీ అనేక మంది పలు రకాల సమస్యలతో సతమతమవుతున్నారు.

తాజాగా 4వ దశ కరోనా బిఎఫ్ 7 వేరియంట్ ప్రభావం జిల్లాలో వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదు. దేశ విదేశాల నుండి రాకపోకలు సాగించే వారిపై నిఘా అవసరం. ప్రస్తుతం కరోనా జాగ్రత్తలు 95 శాతం మంది ప్రజలు పాటించడం లేదు. జన సమూహం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు పెట్టుకోవాలని ప్రభుత్వం సూచించినా ఎక్కువ మంది మాస్కులు ధరించడం లేదు. రాజకీయ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. వేలాది మంది ఒకేచోట గుమిగూడుతున్నా కనీస జాగ్రతలు పాటించడం లేదు.

జాతీయ పోటీలకు ఎన్ఆర్ విద్యార్థుల ఎంపిక

విజయవాడ: ఎన్ఆర్ స్కూలు విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి 29 వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే అండర్-14 రోల్‌బాల్ సబ్ జూనియర్ నేషనల్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపిక అయ్యారని స్కూల్ ప్రిన్సిపల్ ఆర్ఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు కోచ్ ప్రసాద్ అభినందించారు.

ఇంటర్నేషనల్ వ్యాక్సినేషన్ సెంటర్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న అంతర్జాతీయ వ్యాక్సినేషన్ సెంటర్(ఐవిసి)లో సోమవారం రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలియచేశారు. మొదట ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్‌తో ప్రారంభించి అన్ని పనిదినాలలో ప్రతిరోజూ వ్యాక్సినేషన్ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. పర్యాటకులందరూ వారి పాస్ పోర్టులను ఇమెయిల్ చేసి వ్యాక్సినేషన్ కోసం అపాయింట్మెంట్ పొందవచ్చని తెలిపారు. ఒక వ్యక్తికి వ్యాక్సినేషన్ ఫీజు కింద నామమాత్రపు రుసుము రూ.500 వసూలు చేస్తారనీ, ఈ మొత్తాన్ని హెచ్‌డిఎఫ్సి బ్యాంక్ ఖాతా నెంబరు 99991234566999 ద్వారా చెల్లించాల్సి వుంటుందని వివరించారు. ఒకే రోజు కనీసంగా ఇద్దరు వ్యక్తులు అప్పాయింట్మెంట్ పొందవచ్చుననీ, ఇద్దరు వంతున అధికసంఖ్యలో కూడా అప్పాయింటిమెంట్‌ను పొందేందుకు అనుమతిస్తారనీ ఆమె పేర్కొన్నారు. అవసరమైన సహాయం కోసం వారు వాట్సప్ నెంబరు 8978633599కు సంప్రదించవచ్చని డాక్టర్ సౌభాగ్యలక్ష్మి ఈ ప్రకటనలో వివరించారు.

పింఛన్లు రద్దు చేయొద్దని వినతి

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరంలో పెన్షన్లు తొలగించకుండా జనవరి మాసం కూడా పంపిణీ చేయాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టరేట్‌లో, అలాగే వియంసిలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్, కమిషనర్‌కు వేర్వేరుగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో సుమారు 4,500 పెన్షన్లను రకరకాల సాకులతో తొలగించాలని అధికారులు నిర్ణయించారని అన్నారు. అయితే పొరపాట్లను సరి చేసుకోవడానికి తగిన సమయం ఇవ్వాలని కోరారు. పెన్షన్లు తొలగించకుండా జనవరి నెల కూడా పెన్షన్లు పంపిణీ చేయాలని కోరారు.

సప్త పురస్కార గ్రహీత బెజగం రవికుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ కు 2022వ సంవత్సరానికి ఏడు కళా పురస్కారాలు లభించాయి .రెండు రాష్ట్రాల స్థాయిలో ఏడు కళా పురస్కారాలను రెండు రాష్ట్రాల స్థాయిలో ఏడు కళాపరిషత్తులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రదానం చేశాయి.సత్తెనపల్లి రోటరీ క్లబ్ వారిచే రోటరీ అవార్డు ఉగాది పురస్కారం, విశాఖపట్నం శ్రీ దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖ రత్న కళాపరిషత్తు వారి జాతీయ రత్న ఉగాది పురస్కారం, విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ , ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ వారి ఎన్టీఆర్ జాతీయ కళారత్న, ఎన్టీఆర్ జాతీయం నాటక రత్న అవార్డు,విశ్వకర్మ సేవా ఫౌండేషన్ గ్రేటర్ వరంగల్ వారు జాతీయ కళాజ్యోతి అవార్డు, విజయ శ్రీ సాంస్కృతిక సేవా సంస్థ,ఆంధ్ర ఆర్ట్స్ అకాడమి నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు జీవిత సాఫల్యం, జాతీయ నాటక రత్న అవార్డులు, తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ 10వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక జాతీయ గ్రామీణ కళాజ్యోతి పురస్కారం, విజయ శ్రీ సాంస్కృతిక సేవా సంస్థ, ఆంధ్ర ఆర్ట్స్ విజయవాడ అకాడమి వారి అమర గాయకుడు ఘంటసాల కళాబంధు పురస్కారంను ఆయనకు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఈ పురస్కారాలను తనకు ప్రధానం చేసిన సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రముఖులు కళాకారులు మిత్రులు శ్రేయోభిలాషులు, బంధువులు రవికుమార్‌ను అభినందించారు.

బెజగం రవికుమార్

తెనాలిలో ఐఎఎస్ గురుకుల పాఠశాల ఏర్పాటు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి ప్రాంతం శేకూరులో ఆచార్య కౌటిల్య ఐఎఎస్ గురుకుల పాఠశాల ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకులు ఐఆర్ఎస్ అధికారి శివ అచ్చయ్య తెలిపారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం జన్మదినం సందర్భంగా సోమవారం కుమార్ పంప్స్ కార్యాలయంలో 2023 విద్యా సంవత్సరానికి ఆచార్య కౌటిల్య ఐఎఎస్ గురుకుల పాఠశాల మొదటి ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 8వ తరగతి విద్యపూర్తి చేసుకున్నవారు మాత్రమే విద్యాపీఠంలో అర్హత పొందగలరని తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులకు మాత్రమే గురుకుల విద్యాపీఠంలో ప్రవేశాలు ఉంటాయన్నారు. ఆత్మధిక మార్కుల ఉత్తీర్ణత ప్రామాణికంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. రికమండేషన్, డొనేషన్ లాంటి వాటికి ఆస్కారం లేదని చెప్పారు. ఉత్తమ విద్యాబోధనలతో ఆచార్య కౌటిల్య గురుకుల విద్యాపీఠం సక్సెస్ సాధిస్తుందని కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం అన్నారు. అలనాటి విద్యాబోధన, క్రమశిక్షణ పాఠశాల విద్యకు అవసరమని అన్నారు. విద్యాపీఠం నిర్వాహకులకు శేకూరులో రెండెకరాల స్థలాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు.

పరీక్షల నోటిఫికేషన్ ఆవిష్కరిస్తున్న కొత్త సుబ్రమణ్యం, శివ అచ్చయ్య

సర్వేను ప్రారంభిస్తున్న శిఖా విజయలక్ష్మీ

శాశ్వత భూహక్కును రైతులు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -ప్రతిపాడు

జగనన్న శాశ్వత భూహక్కును రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్వేయర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని వంగిపురం గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు కార్యక్రమం డ్రోన్ సహకారంతో గ్రామ సర్పంచ్ శిఖా విజయలక్ష్మి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేయర్ మాట్లాడుతూ రైతులు వారి పంట వివరాలు నమోదు ప్రక్రియ దగ్గరుండి చేయించుకోవాలని ఏమైనా ఇబ్బందులు ఉంటే ముందుగా తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఓ రాంబాబు, విలేజ్ సర్వేయర్ అనిల్ లైసెన్స్ సర్వేయర్ ప్రకాష్, చెరుకూరి శ్రీనివాసరావు పుష్పల వినోద్, ఎస్ నవీన్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీలకు ఎస్ఎస్‌కె విద్యార్థిని

ప్రజాశక్తి-మైలవరం: జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు స్థానిక ఎస్ఎస్‌కె పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం జాన్ లాజరస్ సోమవారం తెలిపారు. ఈ నెల 17, 18 తేదీలలో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలికల అంతర్ జిల్లాల త్రోబాల్ పోటీలు కడప జిల్లాలో జరిగాయన్నారు. ఈ పోటీలలో ఎర్రగుంట సంహిత అత్యుత్తమ ప్రదర్శన కనబరచడంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక అయిందన్నారు. ఈ సందర్భంగా సంహితతో పాటు కోచ్ వేణును పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి మోహన్‌రావు, కరస్పాండెంట్ గొల్లపూడి భావన, రాజేష్‌బాబు అభినందించారు.

పౌష్టికాహారంతో క్షయ వ్యాధి నివారణ

హై రిస్క్ గర్భిణీ స్త్రీల రిఫరల్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: క్షయ వ్యాధి రోగులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చునని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. ప్రధాన మంత్రి టి.బి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిర ఆవరణలో క్షయ వ్యాధి గ్రస్తులకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్‌లు పౌష్టికాహార కిట్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షయ వ్యాధి నివారించడంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగులకు పౌష్టికాహారాన్ని అందించి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశామన్నారు. క్షయ వ్యాధికి సంబంధించిన లక్షణాలు అందరిలోనూ అంతర్గతంగా ఉంటాయని ఐతే అనారోగ్యంతో రోగ నిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారిలో క్షయ వ్యాధికి సంబంధించిన బాక్టీరియా వద్ధితో లక్షణాలు బయటపడతాయన్నారు. క్షయ వ్యాధి రోగులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వ్యాధిని అదుపులో ఉంచవచ్చునన్నారు. జిల్లాలో రెండువేల మంది వరకు క్షయ వ్యాధి బాధితులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ నివేదికలు తెలుపుతున్నాయని వారందరికీ పౌష్టికాహారాన్ని, మందులను అందించడం ద్వారా వ్యాధిని నియంత్రించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. అధికారులు కూడా క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం అందించడం లో ఆర్థికంగా చేయూతనందించడం శుభపరిణామమని, ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నియంత్రణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఢిల్లీరావు పిలుపునిచ్చారు. పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.యం.సుహాసిని, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా. జె.ఉషారాణి, టి.బి.యూనిట్ పర్యవేక్షకులు ఉన్నారు

మాతాశిశుమరణాలపై దృష్టి సారించాలి : కలెక్టర్

మాతాశిశు మరణాలు నమోదు కాని జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హైరిస్క్ గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాతాశిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో మాతృ మరణాల నివారణలో భాగంగా రూపొందించిన హై రిస్క్ గర్భిణీ స్త్రీల రిఫరల్ పుస్తకాలను కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, డిప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాలను నివారించేందుకు గర్భిణీలో ప్రమాద లక్షణాలు ఎక్కువ కలవారిని (హై రిస్క్) ముందుగా గుర్తించి వారిని ప్రసవానికి ముందుగానే దగ్గరలో వున్న మాతా శిశు నిపుణులు కలిగిన ఆసుపత్రులకు తరలించే ప్రక్రియలోభాగంగా హైరిస్క్ గర్భిణీ తరలింపు రిజిస్టర్లు ఉపయోగపడతాయన్నారు. మాతా శిశు సంరక్షణ లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, మాత మరణాలు సంభవించని జిల్లాగా ఉండేలా కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రమాదకర లక్షణాలు కలిగిన గర్భిణీ లను ముందుగానే గుర్తించి తగిన కార్యాచరణ ద్వారా సుఖ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని తద్వారా తల్లి బిడ్డ ఆరోగ్య సంరక్షణకు దోహద పడవచ్చునని కలెక్టర్ పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో మరణాల నివారణకు ముందస్తు ప్రణాళికతో హై రిస్క్ గర్భిణీస్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ జె. సునీత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.యం.సుహాసిని, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, లక్ష్మి కుమారి ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



చింతలపూడిలో..

పెనుమాకలో ..

ఘాట్‌రోడ్‌లో..

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాకలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదు రెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమా దంలో ఇద్దరు మృతి చెందారు. పెనుమాకకు చెందిన ఎస్‌కె ఖాశిం అక్కడికక్కడే మృతి చెం దాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావ డంతో మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా అతను కూడా మృతి చెందాడు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీ కొట్టిన బైక్ ..

ప్రజాశక్తి రూరల్- పొన్నూరు

చింతలపూడిలో సోమవారం రాత్రి ఆటోను బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మృతుడు నండూరు గ్రామానికి చెందిన ప్రసాద్ (40). మరొకరికి గాయాలయ్యాయి. మృతుడు రంగ విగ్రహ ఆవిష్కరణ వచ్చి తిరిగి వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య నిడుబ్రోలు ప్రభుత్వ ఆసు పత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. ప్రసాద్ కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. క్షతగాత్రుని నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పొన్నూరు రూరల్ ఎస్సై భార్గవ్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాకుళం వాసులకు గాయాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు కుటుంబ సభ్యులు శ్రీశైలం నుండి తిరుగు ప్రయాణంలో నరసరావుపేటలో దిగి ఆటో లో కోటప్పకొండ వెళ్లి వస్తుండగా ఘాట్ రోడ్ లో ఆటో బోల్తా పడి 8 మందికి తీవ్ర గాయాలు కాగా వారిలో ఇద్దరు పరిస్థితి విష మంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మండలంలోని పెట్లూరి వారిపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా నడపడడం వలనే ప్రమాదం చోటుచేసుకుందని క్షత గాత్రులు తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

టిడిపి జిల్లా పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు డిమాండ్

ప్రజాశక్తి-వినుకొండ

మండల కేంద్రమైన నూజెండ్ల లోని పార్కులో ఏర్పాటుచేసిన మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు గారి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేయడం దారుణమని, ఈ అరాచకాన్ని టిడిపి తీవ్రంగా ఖండిస్తున్నట్లు పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహాలు ధ్వంసం చేసినంత మాత్రాన రాష్ట్ర ప్రజల హృదయాల నుండి ఆయనను తొలగించలేరని అన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసిపి అరాచక శక్తులు ఇటువంటి విధ్వంసాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పార్కులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం వైసిపి మూకల అరాచకానికి పరాకాష్టన్నారు. ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల మనోభావాలను దెబ్బ తీస్తూ విద్వేషాలు సృష్టించేందుకు చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

పేదల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ధరలు పెంచి పేద ప్రజల నడ్డి వైసిపి ప్రభుత్వం విరుస్తోందని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం పెద కూరపాడు లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వ హించారు. స్థానిక ఆరు, ఏడు వార్డులలో ఇంటింటికి తిరి గారు. ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వం పేదల భూములను లాక్కున్నారన్నారు. అక్రమ కేసులతోనే పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అర్తిమళ్ళ రమేష్, అప్పారావు, ముంతాజ్, మిలిటరీ మౌలాలి,అజిముల్ల ఇంకా పలువురు పాల్గొన్నారు.

బంకా పుల్లారావుకు ఘన నివాళులు

ప్రజాశక్తి -అమరావతి

వ్యవసాయ కార్మిక కుటుంబంలో జన్మించి నిరంతరం పనిచేసిన మహోన్నత వ్యక్తి పుల్లారావు అని కెవిపిఎస్ పల్నాడు జిల్లా కార్యదర్శి గంజి మాల రవిబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని అత్తులూరు గ్రామంలో పుల్లారావు వర్ధంతి సందర్భంగా తన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆయన స్ఫూర్తితో పని చేయడమే ఆయనకి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు, అత్తలూరు సర్పంచ్ బంక సరోజిని, మోదిన్ వల్లి పుల్లారా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాతులూరులో 'ఇదేం ఖర్మ' నిర్వహిస్తున్న నాయకులు

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు : టిడిపి

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరులో చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బండారు పల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఇంటింటకి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యవతిరేక విధానాలను వివరించారు. అభివృద్ధి చేతకాని సిఎం జగన్, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు.

దోచుకోవడం, దాచు కోవడమే వైసిపి పనిగా పెట్టుకుందని, రాష్ట్రంలో ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శిం చారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలని,వచ్చే ఎన్నికల్లే టిడిపిని గెలి పించాలని కోరారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే

నరసరావుపేట టిడిపి ఇన్‌ఛార్జి చదలవాడ

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి హత్యా రాజకీయాలను ప్రోత్స హిస్తున్నారని నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చదలవాడ మాట్లాడుతూ ఇటీవల పట్టణంలో రహంతుల్లాపై దాడి,వృద్ధుడు ఇబ్రహీం దారుణంగా హత్యకు ఎమ్మెల్యేనే కారణమన్నారు. పేద కుటుంబానికి చెందిన ఇబ్రహీం మసీదులో ఇమామ్ గా విధులు నిర్వహిస్తుంటారనన్నారు. హత్య చేసిన నిందితులు బాలాజీ గౌడ్,వరవకట్ట బాబులను అరెస్ట్ చేశా రని ఎం.వి. ఫుట్వేర్ సుభాని,షేక్ కార్పోరేషన్ చైర్మన్ ఖాజా వలిల పథకం ప్రకారం ఇబ్రహీం ను హత్య చేయించారన్నారు. ఇబ్ర హీం హత్యకు నిరసనగా ధర్నా నిర్వహిస్తే ఆర్డీవో,కలెక్టర్, డిఎ స్పీలు హామీ ఇచ్చి బాధిత కుటుంబానికి ఎక్స్ గ్రేషియాగా రూ.25 లక్షలు ఇస్తామని ప్రకటించారన్నారు.ఈ విషయాన్ని సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ను,ఎస్పీని కలిసి తెలియజేశామని, ఆయన స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తా మని హామీ ఇచ్చారన్నారు. మాచర్లలో జరిగిన సం ఘటన మరువక ముందే నరసరావుపేటలో హత్య జరగడం దారుణమన్నారు. వైసిపి నాయకులు, వాలంటీర్లు పింఛన్లు తొలగిస్తామని, పట్టణ,గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాంని ఆరోపించారు. ఇబ్రహీం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

చుండు గంగిరెడ్డి కుమారులు వెంకటరెడ్డి, నాగిరెడ్డి గారి పేరిట అమరావతి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ లో 173/1960గా రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ మరియు చుండు వెంకటరెడ్డి కుమారుడు నరసింహారెడ్డి గారి పేరిట వ్రాయించి అమరావతి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ లో 14/1988 గా రిజిస్టర్ కాబడిన వీలునామా దస్తావేజులు పల్నాడు జిల్లా యడ్లపాడు నుండి బోయపాలెం వస్తుండగా ద్విచక్రవాహనం లోనుండి జారి పడిపోయినవి. దొరికిన వారు క్రింది చిరునామా కు తెలియజేయగలరు.

ఇట్లు
A.శివరామకృష్ణారెడ్డి,
అడ్వకేట్, గుంటూరు,
సెల్ : 9848829388

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.83/2020

బిట్వీన్:
కనమర్లపూడి రవి కుమార్ ....వాది
మరియు
కొలశెట్టి ప్రదీప్ కుమార్ ...ప్రతివాది
ప్రతివాది:-కొలిశెట్టి ప్రదీప్ కుమార్, S/o సంపూర్ణం, H.No.15-98/2, నేతాజినగర్, పిడుగురాళ్ళ.

పై నెంబరు దావాలోని పరిహరములను కోరుతూ వాది మీపై దావా వేసి యున్నాడు. మీరు ది.02-02-2023న ఉదయం 10-30 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరయి మీ అభ్యంతరాలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది:02-02-2023.
పిడుగురాళ్ళ,
తేది:27-12-2022

డి.చెన్నయ్య,
అడ్వకేట్,
పిడుగురాళ్ళ.

మహారాజ శ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S 51/21.

1.నాగరాజు నవీన్ మరి యొకరు ...వాదులు.
మరియు
1.బేతంచెర్ల అప్పయ్య మరి 16 మంది ...ప్రతివాదులు.
D3- కొలా శ్రీనివాసరావు
తండ్రి. ఉదయ బాస్కరరావు. ఇ నెం: 28-77/1, సుబ్బయ్య తోట, చిలకలూరిపేట(పోస్ట్), పల్నాడుజిల్లా.
D14-దాసరి భాస్కరరావు తండ్రి చంద్ర రావు, ఇ నెం: 12-14-25/2, నెహ్రునగర్, గుంటూరు పోస్టు & జిల్లా,

పైన తెలిపిన 3 మరియు 14 వ ప్రతివాదులకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనన నందును, శ్రీ కోర్టువారి వుత్తర్వుల ప్రకారము ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియచేయటమైనది. వాయిదా 23-1-2023, ది 21-3-2023 వ తేది. ఉ. 10.30 గంటలకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయము గా గాని లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలను తెలియ చేసుకొన వలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానింప బడునని తెలియ చేయటమైనది.
వాయిదా: 23-1-2023.

ఇట్లు :
ముత్తవరపు శ్రీనివాసరావు,
అడ్వకేట్, నరసరావుపేట.

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	31,747
మిర్చి ఎగుమతి	:	30,772
మిర్చి నిల్వ	:	10,521

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 26,000
నెం.5	21,000- 21,000
273	10,000 - 24,000
341	10,500 - 24,500
4884	10,000 - 18,500
నాన్ ఎసి	
తేజ	9,500 - 23,000
బడిగి	10,000 - 27,500
దేవనూరు డీలక్స్	12,000- 26,000
తాలుకాయలు	4,500 - 13,500
	ఎసి
334	16,000 - 25,000
341	18,000 - 20,500
తేజ	16,500 - 25,500
బడిగి	20,500 - 22,500
తాలుకాయలు	4,500 - 10,400

కార్మిక శాఖాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బీమా కార్డుల కోసం భవన నిర్మాణ రంగం కార్మికుల వినతి

ప్రజాశక్తి - అమరావతి

తమకు బీమా కార్డులు ఇవ్వాలని, పాత వాటిని రెన్యువల్ చేయడంతోపాటు పెండింగ్ క్లెయిములను పరిష్కరించాలని భవన నిర్మాణ రంగంలోని వివిధ పనులు చేసే కార్మికులు కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని స్థానిక సహాయ కార్మిక శాఖాధికారి ఎస్కె ఖాజావలికి సోమవారం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ కరోనా కాలంలో ఉపాధి పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడ్డారని, కార్మిక సంక్షేమ నిధి నుండి ఆర్థిక సాయం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయకపోగా రూ.1400 కోట్ల కార్మికుల నిధులను దారి మళ్లించిందని అన్నారు. అమరావతి మండలములో ఇసుక రేవులున్నా ఇళ్ల నిర్మాణదార్లకు ఇసుక అందక కార్మికులకు పనులు దొరకడం లేదని, ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, బాలలతో పని చేయిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు షేక్.రఫీ, ఉపాధ్యక్షులు ఎం.నవీన్‌కుమార్, కార్పెంటర్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస ఆచార్యులు, దాసు, భవన నిర్మాణ సంఘము నాయకులు ఎల్.ఏడుకొండలు, మొహిద్దిన్‌వలి పాల్గొన్నారు.

కార్యాలయానికి స్థలం కేటాయించండి

కలెక్టర్‌కు వినియోగదారుల హక్కుల రక్షణ వేదిక వినతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం పల్నాడు జిల్లా శాఖకు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టనంలో 10 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తే కార్యాలయ భవన నిర్మాణానికి అకాశం ఉందని ఫోరం జిల్లా అధ్యక్షులు బి.నాగసాయిప్రసాద్ అన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు సభ్యులతో కలిసి సోమవారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోరానికి జిల్లా వ్యాప్తంగా పట్టణ, మండల, గ్రామ స్థాయిల్లో 200 మంది సభ్యులున్నారని చెప్పారు. వీరంతా వినియోగదారుల హక్కులు, సమస్యలపై పని చేస్తున్నారని, ఈ అంశాలపై వివిధ సందర్భాల్లో వీరు కార్యాలయానికి వస్తుంటారని తెలిపారు. ఒక్కోసారి రాత్రి అవుతుందని, ఇళ్లకు వెళ్లలేని పరిస్థితి, ఇక్కడే ఉండాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ కారణంగా కార్యాలయానికి స్థలం కేటాయించాలని, భవన నిర్మాణానికి దాతలు ముందుకొస్తారని చెప్పారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన వినియోగదారులు కూడా ఒస చేయాల్సి వచ్చినప్పుడు భవనం ఉపయోగపడుతుందన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఫోరం జిల్లా అధ్యక్షులు చేగు వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షులు పూనూరు కృష్ణకుమారి, పి.రమాదేవి, వి.కేశవరావు, టి.వెంకటేష్, ఎ.కమలాకర్, వి.పవన్ కుమార్, ఎన్.పవన్ కళ్యాణ్, సిహెచ్ రేవంత్‌నాథ్, డి.లక్ష్మయ్య, వి.చిరంజీవి, షేక్ మహబూబ్ సుభాని, డి.చెంచు, వెంకటేశ్వర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా 25 ఏళ్ల అవార్డు వచ్చిన సందర్భంగా డాక్టర్ ఎస్.రమాదేవి కలెక్టర్ సన్మానించారు.

స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించండి

అధికారులు, సిబ్బందికి పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశం - బాధితుల నుండి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలన్నింటినీ సకాలంలో పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాలులో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుండి అర్జీలను కలెక్టర్ స్వీకరించగా 60 మంది వివిధ సమస్యలపై వినతులిచ్చారు. జెసి శ్యామ్‌ప్రసాద్, డిఆర్‌ఒ వినాయకం, ఇతర అధికారులు పాల్గొన్నారు. అర్జిదార్లకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అన్నదనం ఏర్పాటు చేయగా దాతలను అధికారులు సత్కరించారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దు..

వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి కోరారు. మీటర్లు ఏర్పాటు రైతులకు నష్టమని, పైగా దీనికి రూ.7 వేల కోట్లు ఖర్చు ఎవరి ప్రయోజనం కోసమో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాలని అన్నారు. పక్కనున్న తెలంగాణలో ఏర్పాటు చేయబోమని అక్కడ సిఎం ప్రకటించారని, మోటార్లు రైతులకు ఉరితాళ్లుగా అక్కడి సిఎం తేల్చి చెప్పారని గుర్తు చేశారు.

ఆశాల తొలగింపు నిర్ణయం సరికాదు

ఆశా వర్కర్లపై ఆంక్షలతోపాటు విధుల నుండి తొలగించే ప్రయత్నాలు మానుకోవాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి కోరారు. 2001 నుండి ఆశా కార్యకర్తలు ప్రజలకు సేవలందిస్తున్నారని, కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేశారని చెప్పారు. వారికి గైడెన్స్ ఇవ్వడం, తొలగించడం వంటి అధికారులు సచివాలయ ఎఎన్ఎంకు ఇవ్వడం సరికాదని, 60 ఏళ్లు దాటిన వారినీ తొలగించాలని భావించడం అన్యాయమని అన్నారు. ఈ నిర్ణయాలను ప్రభుత్వం వెనుక్కు తీసుకోవాలని కోరారు.

సిపిఎస్, ఇతర సమస్యలపై వినతి

సిపిఎస్ రద్దు, డిఎ బకాయిలు తదితర సమస్యలపై కలెక్టరేట్ ఎదుల ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు సంపత్‌బాబు మాట్లాడుతూ 2003 డీఎస్సీ వారికి ఓపిఎస్‌ను వర్తింపజేయాలని, ఏడు విడతల డిఎ బకాయిలు, రెండు కొత్త డిఎలను వెంటనే చెల్లించాలని కోరారు. ఆర్జిత సెలవుల నగదు బకాయిలు ఉద్యోగ విరమణ పొందిన బెనిఫిట్‌లో చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉద్యోగులకు బకాయి ఉన్న రూ.1700 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ జమ చేయాలని, 11వ పీఆర్సీలోని అసంబద్ధాలు అసమానతలు తొలగించడానికి వెంటనే కమిటీని, 12వ పే కమిషన్‌ను నియమించాలని కోరారు.

స్మశానాలకు ప్రహరీలల కోసం వినతి

నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లోని ముస్లిములు వినియోగించే ఖబర్‌స్థాన్‌లకు ప్రహరీలు నిర్మించాలని, భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఎంఐఎం విన్నవించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ వలి మాట్లాడుతూ నరసరావుపేట మండలం మూలకలూరు అగ్రహారం, రొంపిచర్ల మండలం మునమాక, విప్పర్లపాలెం, ఇప్పర్ల తదితర గ్రామాల్లో ఖబర్‌స్థాన్‌లకు ప్రహరీలు లేవని, అపారిశుధ్యంతోపాటు మొక్కలు పెరిగి ఇబ్బందిగా మారాయని చెప్పారు. వక్ఫ్ బోర్డు సిఇఒతో దీనిపై మాట్లాడతామని కలెక్టర్ హామీనిచ్చారు.

ప్రజాశక్తి - నరసరావుపేట

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం ద్వారా పోలీస్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసాన్ని పెంచాలని సిబ్బందిని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో భాగంగా ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వీటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. డీఎస్పీలు ఆదినారాయణ, విజయభాస్కర్‌రావు, రవిచంద్ర, సిఐ సుభాషిణి, ఎస్ఐలు పాల్గొన్నారు.

రెండేళ్లయినా బంగారం రికవరీ కాలేదు

తాను బంగారు ఆభరణాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తుంటానని, 2020లో తన వద్ద దుండగులు నగలు కాజేశారని చిలకలూరిపేటకు చెందిన స్వర్ణకారుడు గుండా భావన్నారాయణ ఫిర్యాదు చేశారు. ఒకరి కోసం తాను తయారు చేసిన ఆభరణాలను ఇవ్వడానికి విజయ బ్యాంక్ సెంటర్‌లో ఆటో ఎక్కానని, ఆటో నరసరావుపేట రోడ్డు ఎన్‌టిఆర్ కాలనీ వచ్చే సరికి అప్పటికే ఆటోలో ఉన్న ముఠా మత్తు ఇచ్చి 38.5 గ్రాముల ఆభరణాలు అపహరించారని తెలిపారు. దీనిపై తాను పోలీసులకు ఫిర్యాదు చేసి సిసి కెమెరాలను పరిశీలించారని, అయినా ఫలితం లేదని చెప్పారు. ఆభరణాల కస్టమర్‌కు తాను నష్టపరిహారం చెల్లించానని, తనకు మాత్రం ఇంకా న్యాయం దక్కలేదని, సొత్తును రికవరీ చేయించాలని కోరారు.

కంపెనీ నుండి పరిహారం కోసం వినతి

విధి నిర్వహణలో భాగంగా ఒక సంస్థకు చెందిన వాహనంలో వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురయ్యామని, డ్రైవర్ మృతి చెందగా తాను ప్రాణాపాయం నుండి బయటపడ్డానని పిడుగురాళ్లకు చెందిన పూర్ణచందు నాయక్ ఫిర్యాదు చేశారు. తన వైద్యానికి రూ.6 లక్షల ఖర్చయిందని, తనకు బీమా ఇప్పిస్తానని పవన్‌సాయి హెచరీస్ యజమాని నరేష్ హామీనిచ్చారని, అయితే ఇప్పించలేదని తెలిపాడు. పైగా అడుగుతుంటే తాను చేయగలిగిందేమీ లేదు.. అంటూ ఆగ్రహానికి గురవుతున్నారని, తనకు పరిహారం ఇప్పించాలని కోరారు.

హత్య కేసు నమోదు చేయడం లేదు

తమ కుమార్తెను హత్య చేసిన అత్తింటి వారిపై కేసు పెట్టడానికి వెళ్లినా పోలీసులు నమోదు చేయడం లేదని మాచర్ల మండలం తురకపాలేనికి చెందిన షేక్ దరియావలి ఫిర్యాదు చేశారు. తన కుమార్తె ఫాతిమాకు బల్లికురవ మండలం వల్లాపల్లికి చెందిన ఖాజావలితో పదేళ్ల కిందట వివాహం చేశామని, అయితే వారు అదనపు కట్నం కోసం ఆమెను వేధిస్తూ ఈ నెల 18న ఎలుకల మందు తినిపించి హత్య చేశారని, దీనిపై బల్లికురవ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి తాను వెళ్లినా రాజకీయ ఒత్తిళ్లతో కేసు నమోదు చేయడం లేదని వివరించారు. తన కుమార్తెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని, అత్తింటి వారి నుండి వారికీ ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

లాయర్.. బీమా చెక్కు ఇవ్వడం లేదు

తన భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెంది ఆరేళ్లవుతున్నా బీమా నగదు రాలేదని దుర్గి మండలం అడిగొప్పులకు చెందిన అమృతలూరి పిచ్చయ్య ఫిర్యాదు చేశారు. బీమా కంపెనీని సంప్రదించగా వారు చెల్లించినట్లు చెబుతున్నారని, గుంటూరుకు చెందిన సంబంధిత న్యాయవాది మాత్రం సరైన సమాధానం ఇవ్వడం లేదని చెప్పారు. తాడేపల్లికి వెళ్లి వస్తున్న క్రమంలో డోలాస్ నగర్ వద్ద టిప్పర్ ఢీకొని తన భార్య చనిపోయిందని, టిప్పర్ యజమాని బీమా కంపెనీ ద్వారా తమకు రూ.7.5 లక్షలు చెల్లిస్తామని చెప్పి సంబంధిత పత్రాలను బీమా కంపెనీ వారికి లాయర్ సమక్షంలో అందించారని వివరించారు. బీమా చెక్కును న్యాయవాదికి ఇచ్చామని కంపెనీ చెబుతుండగా న్యాయవాది మాత్రం జాప్యం చేస్తున్నారని అన్నారు.

దాడి చేసినా పట్టించుకోని పోలీసులు

తమపై కత్తులతో దాడి చేసిన వారిపై పోలీసులు కేసు పెట్టడం లేదని వినుకొండ పట్టణంలోని నరగాయకుంటకు చెందిన షేక్ మౌలాలి, మస్తాన్, సారాబి, షకీలా ఫిర్యాదు చేశారు. తమపై షేక్ అజీజ్, శబ్బార్, జాకీర్, నరసింహా నాయక్, షేక్ ఫరీసా కత్తులతో దాడి చేశారంటూ గాయాలను చూపారు. వారిని పోలీసులు పట్టించుకోపోవడంతో వారు మళ్లీ దాడికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తమపట్ల వినుకొండ పోలీసులు చులకన భావం ప్రదర్శిస్తున్నారని, కేసు నమోదు చేయబోమని చెబుతున్నారని పేర్కొన్నారు. నిందితుల నుండి తమకు ప్రాణహాని ఉందన్నారు.

గర్భిణి మృతి కేసులో తోడి కోడల్ని వదిలేశారు..

కడుపులో ఆడ శిశువు ఉందని తెలిసిన అత్తింటి వారు ఆమెకు విషమిచ్చి చంపారని, ఈ కేసులో అత్తింటి వారు అరెస్టయ్యారని, తోడికోడలును మాత్రం వదిలేశారని మృతురాలు శ్రావణి బాబాయి అయిన బల్లికురవ మండలం కొప్పెరపాలేనికి చెందిన కిలారు రాంబాబు ఫిర్యాదు చేశారు. మృతురాలు శ్రావణి అత్తగారి తల్లి, వృద్ధురాలు అయిన ధనలక్ష్మమ్మ మృతి చెందగా తమపై కేసు పెట్టారని, రాజీ కోసం బెదిరిస్తున్నారని చెప్పారు.

భర్త నుండి రావాల్సిన డబ్బు ఇప్పించండి

తమ కుమార్తె భవిష్యత్ కోసం ఇస్తానన్న డబ్బును భర్త ఇవ్వడం లేదని ఓ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన భర్త పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా పని చేస్తుంటారని, వివిధ కారణాల వల్ల తాము విడిపోయామని తెలిపారు. కోర్టును ఆశ్రయించగా తమ కుమార్తె కోసం రూ.4 లక్షలు ఇవ్వాలనే అంగీకారం కుదిరిందని, అయితే రూ.లక్ష మాత్రమే ఇచ్చి మిగతా రూ.3 లక్షలను ఆరు నెలలైనా ఇవ్వడం లేదని వివరించారు.

ప్రజాశక్తి
గుంటూరు
5
మంగళవారం 27 డిసెంబర్ 2022

దళితులకు స్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

స్పందనకు 106 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు : స్పందనలో ప్రజల నుండి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, పరిష్కరించిన అర్జీలు రీఓపెన్ కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ జి.రాజ కుమారి, డిప్యూటీ కలెక్టర్లు లలిత, భాస్కర నాయుడు, డిఆర్‌ఒ కె.చంద్ర శేఖరరావు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన 106 మంది అర్జీదారులు స్పందనలో పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతులను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ , జెసి తదితరులు

దళితులకు స్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

గ్రామంలో దళితులకు స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని వట్టిచెరుకూరు మండలం, అనంతవరప్పాడుకు చెందిన జి.బాలచెన్నులు, కె.లక్ష్మణరావు, జి.ఏడుకొండలు అర్జీ అందచేశారు. గ్రామంలో సుమారు 700లకుపైగా దళిత కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, మొదటి నుంచి స్మశాసన వాటిక లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు స్మశాసన వాటికలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాఠాలు సరిగా బోధించడం లేదు

వట్టిచెరుకూరు మండలం, వింజనంపాడులో జెడ్పి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పాఠాలు సక్రమంగా బోధించట్లేదని, అదేమని తల్లిదండ్రులు అడిగితే వారి పిల్లలను పాఠశాల బయటకు పంపిస్తున్నాడని, తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని పాఠశాల దాత డాక్టర్ చిరుమామిళ్ల చౌదరి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కె.యశోధ తదితరులు స్పందనలో అర్జీ అందచేశారు. ఇప్పటి దాకా టెన్త్ విద్యార్థులకు 4 ఛాప్టర్లు చెప్పాల్సి ఉండగా ఒక్క ఛాప్టరే పూర్తి చేశాడన్నారు. మరోవైపు పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయన్నారు. విద్యార్థినుల పట్ల సదరు ఉపాధ్యాయుడి తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందన్నారు. అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నాడన్నారు. పదో తరగతిలో మొత్తం 16 మంది విద్యార్థులుంటే సదరు ఉపాధ్యాయుడి తీరు వల్ల 3గ్గురు టిసిలు తీసుకొని వెళ్లారన్నారు. ఉపాధ్యాయుడిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, దీంతో అతను మెడికల్ లీవుపై వెళ్లాడన్నారు. హెచ్‌ఎంకు, ఎంఇఒకు, డిఇఒకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ఆయా కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు వార్డు సచివాలయాల్లో అందే సేవలపై పూర్తి అవగాహన కల్పించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి సచివాలయ కార్యదర్శులకు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్ ద్వారా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు అందరూ సిటిజన్ పర్సెప్షన్ సర్వే లక్ష్యాన్ని పూర్తి చేయాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా కార్యదర్శులు అందరూ సచివాలయం పరిధిలో హోం, క్లస్టర్ కంపోస్ట్ తయారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం కమిషనర్ గతవారం స్పందన ఫిర్యాదులు, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి, వాట్సఅప్, కాల్‌సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, కార్యదర్శులతో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కాలని ఆదేశించారు. సోమవారం స్పందనలో 40 ఫిర్యాదులు అందాయి.వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 10, ప్రజారోగ్య విభాగం 5, రెవెన్యూ విభాగం 8, ఉపాసెల్ 3, పరిపాలన విభాగం 1, అకౌంట్స్ విభాగం కి సంబధించి 2 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ మూర్తి, సి.ఎం.ఓ.హెచ్. డాక్టర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కేరళ మంత్రి రాజేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం

కేరళ ప్రభుత్వ స్థానిక స్వపరిపాలన, ఎక్సైజ్ శాఖ మంత్రి ఎం.బి.రాజేష్‌కు సోమవారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. స్వాతంత్ర్య సమరయోధులు, గొప్ప సిద్ధాంత కర్త మాకినేని బసవపున్నయ్య 108వ జయంతి సందర్భంగా విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో 'రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఇక్కడికి వచ్చారు. మంత్రి ఎం.బి.రాజేష్‌కు ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకష్ణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో విజయవాడ వెళ్లారు.

కేరళ మంత్రి ఎం.బి.రాజేష్‌కు స్వాగతం పలుకుతున్న పి.మధు, వై.వెంకటేశ్వరరావు, పి.మురళీకృష్ణ

లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలి

వ్యవస్థాపక దినోత్సవాల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు, విలేకర్లు : పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించటానికి ఇతర లౌకిక పార్టీలతో కలిసి పోరాటాలకు సమాయత్తం అవుతున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో భాగంగా నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక లాడ్జి సెంటర్ నుండి మల్లయ్యలింగం భవన్ వరకూ రెడ్‌షర్ట్ వలంటీర్ల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ పతాకాన్ని జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రపంచ సోషలిస్టు వ్యవస్థాపకులు విఐ లెనిన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాయి. అనంతరం మల్లయ్యలింగం భవన్‌లో కోటా మాల్యాద్రి అధ్యక్షతన నిర్వహించిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ అశాస్త్రీయ పద్ధతులలో పరిపాలన చేస్తున్న బిజెపిని సైద్ధాంతికంగా ఎదుర్కొనే శక్తి కమ్యూనిస్టులకే ఉందన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తుందని, అంబానీ, అదానీల ఆస్తులను పెంచి పోషిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్, రేషన్ కార్డులలో కోతలు పెడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోతల ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. ఇల్లు లేని వారికి కరెంటు మీటర్లు ఉన్నాయని చెబుతున్నారని అది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అవ్వా..తాతా..అంటూ వారి పెన్షన్‌లలో కోతలు పెడుతుందని మండిపడ్డారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కులపీడన, ఆర్థిక దోపిడీ లేని సమా సమాజ స్థాపనే లక్ష్యంగా వీరోచిత పోరాటాలు నిర్వహిస్తున్న ఎర్రజెండా పక్షాన ప్రజలు నివాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నగర నాయకులు ఆవుల అంజిబాబు, ఆకిటి అరుణ్‌కుమార్, ఇప్టా జాతీయ కార్యదర్శి గని తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేటలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యాలయంలో జిల్లా సహాయ కార్యాదర్శి కాసా రాంబాబు జెండా ఆవిష్కరించారు. తాడేపల్లిలో జెండా ఆవిష్కరణలో మంగళగిరి నియోజకవర్గం సహాయ కార్యదర్శి కె.కాశయ్య, నాయకులు టి.వెంకటయ్య, ఎం.డాంగే పాల్గొన్నారు.మంగళగిరిలో సిపిఐ కార్యాలయంలో నియోజ కవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య పతాకావిష్కరణ చేశారు. వినుకొండలో జెండా ఆవిష్క రణలు, ర్యాలీలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌షర్ట్ వాలంటీర్ల ర్యాలీలో రామకృష్ణ, ఇతర నాయకులు, కార్యకర్తలు

స్పందనకు నాలుగు అర్జీలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు మండల తాహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి నాలుగు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ శ్రీకాంత్ కేదారినాథ్ తెలిపారు. వాటిలో ఒకటి పట్టాదారు పాస్ పుస్తకము, స్మశాన వాటికకు స్థలము, అనవసరమైన స్పీడ్ బ్రేకర్ తొలగింపు, వైయస్సార్ పెన్షన్ కానుక వచ్చినట్లు తెలిపినారు. వాటిని త్వరితగతిన పరిష్కరించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిధి లోని అధికారులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ స్పందనకు 8 ఫిర్యాదులు

ప్రజాశక్తి- తెనాలిరూరల్

ప్రభుత్వ అధికారులతో కలసి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన నిర్వహించారు. ప్రజా సస్యలపై మొత్తం 8 ఫిర్యాదులు అందినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. వెల్ఫేర్ స్కీంలు-2, స్మశానవాటిక ఏర్పాటు, గంగానమ్మ పేటలో ఏర్పాటు చేసిన విగ్రహం తొలిగింపు, నూతన భవన నిర్మాణంతో సమస్య, సర్వే, ఓటీఎస్ కొరకు, పెన్షన్ ఆపిన సమస్యలు అందినట్లు తెలిపారు. సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తానని సబ్ కలెక్టర్ తెలిపారు.

సుబ్రమణ్యంకు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

ఘనంగా కుమార్ పంప్స్ అధినేత

కొత్త సుబ్రహ్మణ్యం పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం 71 వ జన్మదిన వేడుకలు తెనాలి సుల్తానాబాద్ కుమార్ పంప్స్ కార్యాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. కుమార్ పంప్స్ కార్మికులతో కలసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శాసనసభ్యులు అన్నాబత్తిన శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కొత్త సుబ్రహ్మణ్యం చేత కేక్ కట్ చేయించారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. పలువురు పట్టణ ప్రముఖులు సుబ్రమణ్యంకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎందరికో ఉపాధినిస్తూ పరిశ్రమను విజయప్రదంలో నడిపిస్తున్న కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ లిలిటెడ్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే అన్నారు. తన చిన్న తనం నుంచి తల్లితండ్రులు, గురువులను గౌరవిస్తూ సుబ్రమణ్యం ఇంతటివారయ్యారని అన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించి వారు నేర్పిన విద్యాబుద్ధులు, ఆచార, వ్యవహారాలను ఆచరించాలని కార్మికుల కుటుంబాలను ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లలు తల్లి తండ్రులను గౌరవించిన నాడే వారు ప్రయోజకులవుతారని అన్నారు. కార్యక్రమంలో కొత్త కృష్ణ కుమార్, కొత్త హరి కుమార్, కొత్త శేషు కుమార్, ఐఆర్ఎస్ అధికారి శివ అచ్చయ్య, ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు, బూరెల దుర్గ, తాడిబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సినీ నటుడు చలపతిరావుకు సంతాపం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : దాదాపు 1200 పైగా చలన చిత్రాల్లో నటించిన చలపతిరావు మరణం పట్ల సోమవారం మా ఏపి వ్యవస్థాపకులు, దర్శకులు దిలీప్ రాజా తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. మంచి క్యారెక్టర్ ఆర్టిస్ట్ ను తెలుగు సినీ పరిశ్రమ కోల్పోయిందని తెలిపారు. చలపతి రావు కుటుంబ సభ్యులకు మా ఏపి సభ్యులు నిర్మాతలు పసుపులేటి నాగేశ్వర రావు, మహమ్మద్ రెహంతుల్లా, నటులు మిలటరీ ప్రసాద్ తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - రెంటచింతల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని గ్రామాల వారీగా చేపట్టిన పనులకు సంబంధించిన నివేదికలను ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లు చదివి వినిపించారు. పండ్ల తోటల పెంపకం ప్రస్తుతం 23 ఎకరాల్లో ఉందని దీనిని 50 ఎకరాలకు విస్తరించాలని, మొక్కలు తిరిగి నాటాలని సూచించారు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 14.50 కోట్లతో 130 పనులు పూర్తి చేయగా వాటిని పరిశీలించారు 2020-21 , 2021-22 సంవత్సరాలకు సంబంధించి 13,14 విడత సామాజిక తనిఖీలు సుమారు 20 కోట్లకు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. సామాజిక తనిఖీలో జడ్పీ వైస్‌చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపిపి చౌడేశ్వరి ఎంపిడిఒ గౌసియా బేగం, జిల్లా విజిలెన్స్ అధికారి టివి విజయలక్ష్మి, జిల్లా మేనేజర్ బి.శ్రీలక్ష్మి, బాబురావు, ఎపిఒ జయచంద్ర, కారంపూడి ఎంపిడిఒ జి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి వెంకటరామిరెడ్డి

అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి-మాచర్ల

రాష్ట్రంలో ముఖ్యమంత్రి సారథ్యంలో నిరుపేదల సక్షేమ పాలన జరుగుతోందని వైసిపి రాష్ట్ర యువజన సంఘ ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం జరిగిన సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటున్న సచివాలయ కన్వీనర్లు అవే కార్యక్రమాలను కొనసాగిస్తూ, ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అందించే సహాయ సహ కారాలను మరోసారి లబ్ధిదారులకు తెలియజేయాలని వివరించారు. అంకిత భావంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామి రెడ్డి, నాయకులు బి.శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ పి.నరసింహారావు, మాచర్ల చిన ఏసోబు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ మాణిక్యరావుకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - రెంటచింతల

మిట్టగుడిపాడు సర్వేయర్ పి.మాణిక్యరావు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదు కుంటామని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని మంచికళ్ళులో ఎంపిటిసి, మాణిక్యరావు భార్య సంపూర్ణమ్మను సోమవారం ఆయన ఓదార్చారు. తన పరంగా సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. అనంతరం మాణిక్యరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎంపిపి డి.చౌడేశ్వరి, సర్పంచ్ పి.చంద్రారెడ్డి, ఎంపిడిఒ గౌసియాబేగం నివాళులర్పించారు.

ఆవులకు అంతుచిక్కని వ్యాధి!

- శరీరంపై బొప్పరలు
- మేత మేయని, నీరు తాగని లక్షణాలు
- అచ్చయ్యపాలెంలో ఒక ఆవు మృతి
- రొంపిచర్లలో మరో ఆవుకు ఈ తరహా వైరస్
- పలు గ్రామాల్లో ఆందోళనకు గురవుతున్న పెంపకందార్లు

ప్రజాశక్తి-రొంపిచర్ల

గత కొన్ని రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆవులు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నాయి. ఆవుల శరీరంపై బొప్ప రలు వచ్చి, ఆకలి లేకుండా ఉండటంతో నీరసించి పోతున్నాయి. మేత మేయకుండా, నీరు తాగకుండా ఉండి పోతున్నాయి. దీని గురించి తమకు అంతు చిక్కడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్ని రోజుల క్రితం మండలంలోని అచ్చయ్యపాలెంలో ఈ తరహా లక్షణాలు సోకిన ఒక ఆవు మృతి చెందింది. సోమవారం రొంపిచర్లలోని రాజులబజారులో మరో ఆవులో ఇవే లక్షణాలు కనిపించాయి. ఇది కొత్త రకం వైరస్ అని, దీనికి సం బంధించిన మందులు తమ వద్ద లేవని, పశువుల మందుల దుకాణాల వద్దకు వెళ్ళి తీసుకోమని పశువైద్య శాఖాధికారులు చెబుతున్నారని రైతులు పేర్కొన్నారు. మందుల దుకాణాల వాళ్ల ఇచ్చిన మందులు వాడినప్పటికి ప్రయోజనం లేదని చెబుతున్నారు. వేలకు వేల రూపాయలు వెచ్చించి మందులు తెచ్చి వాడినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు పట్టించుకోకపోతే ఆవులకే కాక గేదెలకు ఈ వైరస్ సోకి ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించి ఈ వైరస్ సోకిన ఆవులను గుర్తించి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని, దీని నివా రణకు తగు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మిర్చి రైతులకు నష్టపరిహారం చెల్లించండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

'మాటా-మంతి' కార్యక్రమంలో భాగంగా మండల పరి ధిలోని బొప్పూడిలో ఉన్న మిర్చి పంటలను నియోజకవర్గ మహిళా నేతలు సోమ వారం పరిశీలించారు. ఈ విషయాన్ని రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జరీనా సుల్తానా తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పం టలు పూర్తిగా దెబ్బ తిన్నాయని, పత్తి, మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. మిరప పంటకు తామర పురుగు వచ్చి పంట నష్టపోయామని, అధికారులుగాని, ఎమ్మెల్యే గాని రాలేదని రైతులు వాపోతున్నట్లు ఆమె చెప్పారు. తాడేపల్లి ప్యాలెస్‌లోని ముఖ్యమంత్రికి ఈ పంటల నష్టం పట్టడం లేదా? రైతులను ఆదుకోవాలనే ఆలోచన జగన్‌కు లేదా? అని ప్రశ్నించారు. జగన్‌కు ధైర్యం ఉంటే రైతు లకు ఏమి ఇచ్చారో తెలియజేస్తూ ప్రతి గ్రామంలో బోర్డు పెట్టాలని అన్నారు. రైతులకు కట్టాల్సిన పంటల బీమా డబ్బులు కూడా కట్టని ప్రభుత్వం ఇదని ఎద్దేవా చేశారు. 2024లో ముందస్తు ఎన్నికలు జరిపినా కూడా వైసిపిని భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధం గా ఉన్నారని అబిప్రాయపడ్డారు. చిలకలూరిపేట నియోజకవర్గ మహిళా అధ్య క్షురాలు అమరా రమాదేవి, మహిళా ఉపాధ్యక్షులు సిహెచ్ పద్మ, రైతులు పాల్గొన్నా రు.

ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వినుకొండ

ధాన్యం కొనుగోలు కేం ద్రంలో రైతుల నుండి ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు సూ చించారు. బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఇటీవల జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు రైతులకు మేలు జరిగే విధంగా ఉండాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అందుబాటులోకి ఆధార్ సెంటర్

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల మూడో సెంటర్‌లో నూతనంగా ఆధార్ సెంటర్ ని ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ గౌసియా బేగం తెలిపారు. ఈ సెంటర్‌లో నూతన ఆధార్ కార్డు కోసం దరఖాస్తు, ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని అన్నారు. మండలం లోని మరో మూడు గ్రామాల్లో త్వరలో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

వంగవీటి మోహన రంగాకు నివాళి

గుంటూరులో రంగా విగ్రహానికిపూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేయర్, ఎమ్మెల్సీలు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర రాజకీయాలలో వంగవీటి మోహన రంగ మహోజ్వల శక్తి అని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. సోమవారం వంగవీటి మోహన రంగా 34వ వర్ధంతిని పురస్కరించుకొని, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పి రెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్, మద్దాలి గిరిధర్ స్థానిక నగరం పాలెం 3 బొమ్మల సెంటర్ వద్ద ఆధునీకరించిన సర్కిల్, రంగా విగ్రహం ప్రారంభించి పూలమాలలు వేసి ఘన నివా ళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్.సజీల, కార్పొరేటర్లు సాదు ఉమామహేశ్వరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత 20వ డివి జన్‌లోని సంపత్ నగర్ పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రంగా చిత్రపటానికి మేయర్, ఇతర కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. **సత్తెనపల్లిటౌన్:** వంగవీటి మోహనరంగా పేదల పెన్నిధి అని, ఆయనను గుర్తు చేసుకోవా ల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉం దని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తాలూకా సెంటర్‌లోని తెలగ హాస్టల్ లోనూ, పోలే రమ్మచెట్టు వద్ద వున్న రంగావిగ్రహానికి పూల మాలలు వేసి నివా ళులర్పించారు. **ముప్పాళ్ల:** జన సైనికుల ఆధ్వర్యంలో మండలంలోని మాదల, రుద్ర వరం గ్రామాల్లో రంగా విగ్ర హాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. **మాచర్ల:** స్థానిక పార్క్ సెంటర్‌లో రంగా చిత్రపటానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టరు యరమల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కూడ రంగా వర్ధంతి కార్య్ర కమాలు నిర్వహించారు. **తాడేపల్లి రూరల్:** ఎంటి ఎంసి పరిధిలోని కుంచనపల్లి వైసిపి కార్యాలయం వద్ద వంగవీటి మోహన రంగారావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రంగా చిత్రపటానికి వైసిపి గ్రామ అధ్యక్షులు ఎం.రాంబాబు పూలమాలవేసి నివాళులర్పిం చారు. **మంగళగిరి:** మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న రంగా విగ్రహానికి జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు చిట్టెం అవినాష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వంగవీటి మోహన్ రంగా చిత్రపటం ఎదుట పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ సలీం, నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. **తెనాలిరూరల్:** వంగ వీటి మోహన రంగా వర్ధంతి కార్యక్రమాలు పట్టణంలో పలు చోట్ల నిర్వహించారు. వైసిపి ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ కూడలిలో రంగ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షులు జి.వేణు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి అన్న దానం చేశారు.మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో రంగ చిత్రపటానికి పూల మాలవేసి అంజలి ఘటించారు. కార్యకర్తలు చల్ల పుల్లారావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర రావు, హరిప్రసాద్, ఖుద్దూస్, వెంకట పూర్ణ చంద్ తదితరులు పాల్గొన్నారు. **వినుకొండ:** వంగవీటి మోహన్రంగా 34వ వర్ధంతి వేడుకలు వినుకొండలో కాపు సంఘం, యువత నాయకులు కారుపల్లి నాసరయ్య, ఉప్పు మన్నయ్య తదితరుల ఆధ్వర్యంలో జరుపుకున్నారు. స్థానిక మహాలక్ష్మమ్మ వీధి వద్ద వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి కాపు సంఘం నాయ కులు యువకులు పూలమాలలు వేసి నివా ళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి శంకర శ్రీనివాసరావు, అరవాడ కౌన్సిలర్ గంధం కోటి నివాళులర్పించారు. **అమరావతి:** మండల కేంద్రమైన అమరావతిలో రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో వంగ వీటి మోహన్ రంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



తెనాలిలోని స్టేషన్ రోడ్డు కూడలిలో వంగవీటికి నివాళులర్పిస్తున్న వైసిపి కార్యకర్తలు

కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

ప్రజాశక్తి - గుంటూరు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను జెసి రాజకుమారితో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంటలను ప్రోత్సహించేందుకు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడాకి ఈ స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి సోమవారం జిల్లా నలుమూలల నుండి ప్రజలు స్పందనకు వస్తుంన్నందున వారితోపాటు జిల్లా అధికారులకూ వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. స్టాల్‌లో ప్రకృతి వ్యవసాయ పంటలైన అరటి, మినుము, మిర్చి, టమోటా, బెండ, వంగ, తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, చిరు ధాన్యాలు, మసాలా పొడులు, వంట నూనెలను కలెక్టర్ పరిశీలించారు. ఈ ఉత్పత్తులను అధికారులు కొనుగోలు చేసి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంక టేశ్వర్లు, ఉద్యాన శాఖ డీడీ సుజాత, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రాజకుమారి, డీఆర్డీఏ, డ్వామా పీడీలు హరిహరనాథ్, యుగంధర్‌కుమార్, డిఎస్ఒ పద్మశ్రీ, డిపిఒ కేశవరెడ్డి, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ సుమయాఖాన్, కలక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి

కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి , సంఘం నాయకులు

ఎపిజిఇఎ కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కేలెండర్-2023ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా, జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగర కార్యదర్శి కె.సాంబశివారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ షేక్.కరీమ్‌షాఖద్రి తదితరులు పాల్గొన్నారు.

భజన పంతులు బండి నర్సారెడ్డి మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి

బండి నర్సారెడ్డి

తాడేపల్లి కొత్త ఊర్లో రామాలయం దగ్గర భజన కోలాటం నేర్పే బండి నర్సారెడ్డి సోమవారం మృతి చెందారు. భజన కోలాటం నేర్పటంలో నర్సారెడ్డి తన ముద్ర వేశారని, ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేస్తున్నట్టు సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢమైన సానుభూతి తెలిపారు. గతంలో నర్సారెడ్డి పాలకంపాడు ముఠా కార్మికునిగా సిఐటియు నాయకత్వంలో పనిచేశారు.

ధనుర్మాస మహోత్సవాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరంలోని విజయకీలాద్రి క్షేత్రంపై ధనుర్మాస మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోదా అమ్మ వారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణపనులు పూర్తి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని బైపాస్ రోడ్డు వైసిపి కేంద్ర కార్యాలయం రోడ్డులో రూ. 10లక్షల తో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణపనులు పూర్తయ్యాయని మున్సిపల్ డిఇ కృష్ణారెడ్డి తెలిపారు. వాల్ నిర్మాణప నులు కూడా జరుగుతున్నట్లు చెప్పారు.

ఈకెవైసి పెండింగ్ ఖాతాలు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

రైతు భరోసా కేంద్రాలలో పెండింగ్‌లో ఉన్న ఖాతాలకు ఈ-కెవైసిని త్వరగా పూర్తి చేయాలని పొన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్ తిరుమల దేవి సిబ్బందికి సూచించారు. సోమవారం వెల్లలూరు గ్రామం రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న పిఎం కిసాన్ ఈ కెవైసి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండలంలో దాదాపు 8,600 పీఎం కిసాన్ ఖాతాలు నమోదు చేయగా 5300 ఖాతాలు ఈ-కైవైసి పూర్తి అయ్యాయని, 3300 ఖాతాలకు ఈ-కెవైసి నమోదు చేయాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో పెండింగ్లో ఉన్న ఈ -కెవైసి రైతులు వివరాలు ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న రైతులందరూ తక్షణమే తమ వివరాలను తీసుకొని సంబంధిత రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి ఈ-కైవైసి నమోదు చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు , ఫోన్ నెంబర్ లింక్ చేయించుకొని వారు తక్షణమే చేయించుకోవాలని, ఆధార్ నెంబర్ను తప్పుగా ఇచ్చినవారు సరైన ఆధార్ నెంబర్ ఇచ్చి తమ ఈ -కెవైసి నమోదు చేయించుకోవాలని తెలిపారు. వెల్లలూరు రైతు భరోసా కేంద్రంలో దాదాపు 103 పెండింగ్ ఖాతాలు ఉన్నాయని గమనించి కొంత మంది రైతులకు ఫోన్ ద్వారా ఈ-కెవైసి చేయించారు .డెత్ కేసెస్, నోలాండ్ డేటాలు ఆమె పూర్తి చేశారు. మండలంలో ఉన్న పెండింగ్ ఖాతాలన్నిటిని ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయించాలని గ్రామ సిబ్బందిని ఆదేశించారు.

8వ వార్డులో అన్నీ సమస్యలే ..

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మున్సిపల్ పరిధిలోని బ్రహ్మానందపురం 8వ వార్డులో అన్ని సమస్యలేనని, ప్రభుత్వాని అవేమి పట్టటం లేదని టిడిపి నాయకులు విమర్శించారు. సోమవారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి 4వ రోజు ఇంటింటికి తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, పారిశుద్ధ సమస్య,డ్రైనేజీ, రోడ్లు, పిచ్చి మొక్కలు తదితర సమస్యలను వెలిబుచ్చారు. దోమల వలన డెంగ్యూ వ్యాధితో విష జ్వరాల భారిన పడుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను పట్టిచుకోకుండా వైసిపి ప్రభుత్వం ప్రతి నెలా చెత్త పన్ను మాత్రం రూ. 60లు వసూల్ చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో 8వ వార్డు అధ్యక్షులు బెజ్జం కుమార్ , గుంటూరు పార్లమెంటు టిడిపి పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి బెజ్జం రామకృష్ణారావు, తాడేపల్లి పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు కె. శివప్రసాద్, బి. చెన్నయ్య, ఎ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ పోస్టరును చూపుతున్న టిడిపి నాయకులు

అభివృద్ధి పథంలో ఆర్‌టిసి కార్గో సేవలు

ప్రజాశక్తి- తెనాలిరూరల్

2017లో పూర్తిస్థాయిలో కార్గో సరుకు రవాణా ప్రారంభించిన ఏపిఎస్‌ఆర్‌టిసి తన సేవలతో వినియోగదారులను మెప్పించడమే కాకుండా రోజురోజుకీ అభివృద్ధి సాధిస్తుందని ఆర్‌టిసి డిపో మేనేజర్ ఏ రాజశేఖర్ తెలిపారు. సోమవారం రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేసిన ప్రకటనను ప్రజలకు తెలిపేందుకు తెనాలి బస్ డిపోలో విడుదల చేసారు. అతి తక్కువ సమయంలో పార్శిళ్ళను ప్రజల వద్దకు చేరవేస్తూ ప్రజాదరణ పొందుతోంది. గత ఆర్థిక సంవత్సరం 2021-22లో సాధించిన రూ. 122 కోట్ల ఆదాయాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ముగియకుండానే డిసెంబర్ 25 నాటికి అధిగమించింది. 2021లో డోర్ డెలివరీ సౌకర్యం కల్పించి అందరి ప్రశంసలు అందుకొంటోంది. ఆంధ్రతో పాటు హైదరాబాద్ , బెంగళూర్ చెన్నై వంటి నగరాలలో కూడా లాజిస్టిక్స్ సేవలు అందిస్తుంది. రాష్ట్రంలోని 84 బస్టేషన్లలో 480 అధీకృత పార్శిల్ బుకింగ్ ఏజంట్ల వద్ద నగదు చెల్లింపుతో పాటు యుపిఐ సేవలు కూడా ఆర్టీసీ వద్ద లభింస్తుంది. ప్రత్యేకంగా రూపొందించబడిన డిజిటిల ద్వారా, సర్వీసు బస్సులలోని డిక్కీల ద్వారా పార్శిల్, కొరియర్ సేవలు వేగవంతంగా అందిస్తూ డోర్ డెలివరీ చేస్తుంది. విజయవాడ,విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి బస్ స్టేషన్లలో 24X7 పార్శిల్, కొరియర్ బుకింగ్ సేవలు కల్పించబడ్డాయి. డీజిల్ ధరలు పెరిగి సంస్థపై భారం పడినా 2018లో నిర్ధారించిన సరుకు రవాణా రేట్లనే కొనసాగిస్తూ వినియోగదారులకు సేవలందిస్తుంది. ఇతర ప్రైవేటు సరుకు రవాణా ఎజెంట్ల కంటే అత్యంత చవకైన వేగవంతమైన సేవలు అందిస్తూ రూ.122 కోట్ల ఆదాయాన్ని దాటింది. ఈ ఘనత సాధించడానికి అధికారులు, సూపర్ వైజర్లు ,ట్రాఫిక్ సిబ్బంది , కార్గో సిబ్బంది డ్రైవర్ ,కండక్టర్ల కృషి ఎంతో ఉందని ఆర్టీసీ రాష్ట్ర శాఖ తెలిపింది.ఇంకా మెరుగైన సేవలదించే వినియోగదారుల మన్ననలను పొందుతామని ఉన్నతాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సుందరయ్య నగర్‌లో సంక్రాంతి క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

జనవరి 1 నుంచి సుందరయ్యనగర్‌లో సంక్రాంతి క్రీడోత్సవాలు డివైఎఫ్ఐ, ఐద్వా, ప్రజానాట్యమండలి, భవననిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి పండగ రోజు ముగింపుసభ నిర్వహిస్తారని తెలిపారు. అలాగే పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి- మేడికొండూరు

నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ఈనెల 28, 29 తేదీలలో జరగనున్నట్లు గుంటూరు జిల్లా యూత్ ఆఫీసర్ కిరణ్మయి దేవిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడికొండూరు మండలం, సత్తనపల్లి రోడ్డు లోని విసదల అడ్డ రోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 8 గంటల నుండి పోటీలు ప్రారంభమవుతాయి అని తెలిపారు. ప్రధానంగా రన్నింగ్ రేస్, షార్ట్ ఫుట్, కబడ్డీ, వాలీబాల్, ఖో.. ఖోల పోటీలు ఉంటాయన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు నెహ్రు యువ కేంద్ర గుంటూరు వారిచే మెడల్స్, సర్టిఫికెట్ అందజేస్తారని చెప్పారు. పోటీలకు 15- 29 సంవత్సరాల లోపు యువతీ యువకులు పాల్గొనవచ్చు అన్నారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులు టీములుగా ఏర్పడి ఆధార్ కార్డ్, ఫోటోలు, మీ టీమ్ల వివరాలతో పారుపల్లి రమేష్ 96668801ను సంప్రదించాలని తెలిపారు.

వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

జలధార వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి మదర్ తెరిసా కాలనీలో సోమవారం టిడిపి నాయకులు జలధార వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. సుమారు రూ.2లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను టిడిపి మంగళగిరి నియోజకవర్గం సమన్వయకర్త నందం అబద్దయ్య, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, గుంటూరు పార్లమెంటరీ టిడిపి ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావులు ప్రారంభించారు. టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు మాట్లాడుతూ బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా తమకు మంచినీటి సమస్య ఉందని మథర్ తెరిసా కాలనీవాసులు విన్నవించారని అన్నారు. ఈ సమస్యను టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌కు తెలియజేసిన వెంటనే ఆయన సహకారం అందించారని అన్నారు.

మంచినీటి సమస్య తీర్చిన నారా లోకేష్‌కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు డి జ్యోతిబస్, టిడిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వి. వెంకట్రావు, తెలుగు రైతు గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు కె. రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఏ.భూలక్ష్మి, టిడిపి గ్రామ అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, గ్రామ ప్రధాన కార్యదర్శి బి.రమేష్, వివిధ గ్రామాల నాయకులు వి.శ్రీనివాసరావు,ఏ.శ్రీనివాసరావు, ఈ.కోటయ్య, ఎస్. పిచ్చయ్య, కె.రంగారావు పాల్గొన్నారు.

కిట్స్ అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

బాలకృష్ణను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ అధ్యాపకులు ఆర్దల బాలకృష్ణకి లోడ్ ఫ్రీక్వెన్సీ రెగ్యులేషన్ ఇన్ మల్టీసోర్స్, మల్టీ ఏరియా, పవర్ సిస్టమ్ యూజింగ్ మెమిటిక్ ఆప్టిమైజేషన్ స్ట్రేటజీ విత్ ఎనర్జీ స్టోరేజి డివైజ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విక్రమ్ కుమార్ కాంబోజ్, డాక్టర్ సక్సేనా పర్యవేక్షణలో బాలకృష్ణ చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, విభాగాధిపతి డాక్టర్ మూర్తి వీరాస్వామి తదితరులు బాలకృష్ణను అభినందించారు.

రాజధాని కార్మికులను పనిలో కొనసాగించాలి

ఎంపి నందిగం సురేష్‌కు పారిశుధ్య కార్మికుల వినతి

ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న ఎం.రవి, కార్మికులు

ప్రజాశక్తి - తుళ్లూరు : జనవరి నుంచి పనిలో తొలగిస్తారన్న మాటలతో తీవ్ర ఆందోళన చెందుతున్నామని, ప్రభుత్వం, అధికారులతో సంప్రదింపులు జరిపి తమను కొనసాగించేలా చూడాలని రాజధాని పారిశుధ్య కార్మికులు సోమవారం ఎంపి నందిగం సురేష్‌కు వినతిపత్రం అంద జేశారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవితో కలిసి కార్మికులు ఉద్దండరాయుని పాలెంలో ఎంపి సురేష్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. నిధుల్లేవనే పేరుతో తమని విధుల్లో కొనసాగించ లేమని చెబుతున్నారని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

400 కార్మికల కుటుంబాలు రోడ్డున పడతాయి

మందడంలో రోడ్లు ఊడ్చి నిరసన

మందడంలో రోడ్లు ఊడ్చి నిరసన తెలుపుతున్న కార్మికులు

మందడం మెయిన్ బజార్లో సోమవారం పని విరామ సమయంలో రోడ్డు ఊడుస్తు పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం రవి నిరసనలో పాల్గొని మాట్లాడారు. జనవరి నుండి పని కొనసాగించాలంటూ కార్మికులు అసెంబ్లీకి వెళ్లే మెయిన్ బజార్‌ను ఊడ్చి నిరసన తెలిపారని చెప్పారు. రాజధాని గ్రామాల్లో పారిశుధ్య విధుల నిర్వహణ కు సంబంధించిన కాంట్రాక్ట్ సంస్థ టెండర్ డిసెంబర్ చివరికి ముగుస్తుందని, కొత్త టెండర్‌ని సిఆర్‌డిఎ అధికారులు పిలవకుండా జాప్యం చేస్తున్నారన్నారు. జనవరి నుండి రాజధాని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు పనిలేదని చెబుతున్న అధికారులు పనులను నిలిపివేస్తే 400 కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయన్న సంగతిని విస్మరించ వద్దన్నారు.పని కొనసాగించాలని కోరుతూ రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో గత రెండు నెలల నుండి దశల వారి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో రిలే నిరాహారదీక్షలు,భిక్షాటన లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్మికులను అర్థాంతరంగా పని నుండి తొలగించేందుకు ప్రయత్నిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు అండగా యుటిఎఫ్

కేలెండర్, డైరీ ఆవిష్కరించిన పల్నాడు జిల్లా కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉపాధ్యాయుల పక్షాన న్యాయమైన హక్కుల సాధనకు యుటిఎఫ్ పోరాటాలు చేస్తుందని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో యుటిఎఫ్ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్ మరియు డైరీలను జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎం. శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా విద్యాశాఖ అధికారి మేకతోటి వెంకటప్పయ్య ఆవిష్కరించారు. విద్యారంగం అభివృద్ధికి యుటిఎఫ్ చేస్తున్న కృషిని జిల్లా కలెక్టర్ కొనియాడారు. డైరీలో రూపొందించిన ఉపాధ్యాయ వృత్తికి సంబంధించి అంశాలతో పాటు యుటిఎఫ్ ఉద్యమ చరిత్రను పరిశీలించి యుటిఎఫ్ నాయకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి విజయ సారథి, పి. ప్రేమ్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు నంబూరి సుందరరావు, కోశాధికారి జెవిడి నాయక్, జిల్లా మహిళా సహాధ్యక్షురాలు ఏ. భాగేశ్వరిదేవి, జిల్లా కార్యదర్శి మోహనరావు, ఆడిట్ కమిటీ మెంబర్ వై .శ్రీనివాసరావు, ఎస్.ఎం.ఏ గఫార్, కన్వీనర్ షేక్ జమాల్, ఏ శ్రీనివాసరావు, టి అరుణ్ కుమార్, డి కాంతారావు, సిహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధత

మాక్ డ్రిల్ నిర్వహణపై గుంటూరు జిల్లా కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కోవిడ్ కొత్త వేరియంట్‌ను సమర్ధ వంతంగా ఎదుర్కొనే ముందస్తు సన్నద్ధతలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళవారం కోవిడ్ పరీక్షలు, గుర్తింపు, చికిత్సపై మాక్ డ్రిల్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారితో కలసి మాక్ డ్రిల్‌పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్‌కు సంబంధించి చికిత్సపై తెనాలి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, గుంటూరు జీజీహెచ్, అమరావతి రోడ్డులోని జ్వరాల ఆసుపత్రులలో మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు.కోవిడ్ పరీక్షలు, గుర్తింపు, చికిత్సపై సంబంధించి అవసరమైన అన్ని ప్రక్రియలను మాక్ డ్రిల్‌లో తనిఖీ చేయాలన్నారు. పరీక్షలకు సంబంధించి జిల్లాలో అందుబాటులో ఉన్న ర్యాపిడ్ కిట్లు, ఆర్‌టిపిసిఆర్ కిట్లు, మ్యాన్ పవర్ వివరాలు, అలాగే కేసుల గుర్తింపునకు సంబంధించి పాజిటివ్ పేషెంట్లను గుర్తించినప్పుడు వారితో పాటు ఉన్న వారికీ పరీక్షలు చేసే ప్రక్రియకు సంబంధించి గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలతో పాటు, తెనాలి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, అమరావతి రోడ్ లోని జ్వరాల ఆసుపత్రి, పీహెచ్‌సీ, సిహెచ్‌సీలలో బెడ్ల లభ్యత, ఆక్సిజన్ ప్లాంట్లు, చికిత్స కోసం డాక్టర్లు వినియోగించే మాస్కులు, గ్లౌజులు, మందులు తదితర పూర్తి వివరాలను మాక్ డ్రిల్‌లో తనిఖీ చేసి నివేదిక అందించాలన్నారు. కోవిడ్ నూతన వేరియంట్ వల్ల అనూహ్య పరిణామాలు ఉత్పన్నమైతే స్పందించాల్సిన తీరుపై వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా స్థాయి అధికారి నుండి, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, ఫార్మసిస్టులు, క్షేత్రస్థాయిలో పని చేసే ఏఎన్‌ఎం లు, ఆశా వర్కర్ల వరకు స్పందించాల్సిన తీరుపై మాక్ డ్రిల్‌లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.చంద్రశేఖరరావు, డియంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ సుమయాఖాన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. ప్రభావతి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ జయరామక్రిష్ణ, డీసీహెచ్‌ఎస్ హనుమంతరావు, డిప్యూటీ డియం అండ్ హెచ్ ఓ లు అన్నపూర్ణ, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

జగనన్న కాలనీ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

జిల్లాలో 'జగనన్న పేద లందరికీ ఇళ్ల లక్ష్యాలపై సంబంధిత అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు చేయించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, హౌసింగ్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌసింగ్ స్టేజ్ కన్వర్షన్ పనుల్లో స్పెషల్ డ్రైవ్ తో లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. హౌసింగ్ స్టేజ్ కన్వర్షన్ పనుల్లో వెనుక బడిన మండలాలు, జగనన్న కాలనీల్లో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో పని చేస్తున్న అధికారులు అంతా తప్పని సరిగా కోవిడ్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరూ తప్పని సరిగా మాస్క్ లు ధరించాలని సూచించారు. ప్రజల్లో మరింత చైతన్యం తీసుకు రావాలన్నారు. జిల్లాలో స్పెషల్ ఆఫీసర్స్ ఫీల్డ్ విజిట్ కు వెళ్ళిన తరుణం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హైరిస్క్‌లో ఉన్న గర్భిణులకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ మాట్లాడుతు కొత్తగా జగనన్న హౌసింగ్ కాలనీలకు ఇసుక అనుమతి వచ్చిన నేపథ్యంలో త్వరిత గతిన సర్వే కోట్ చేయించాలని సూచించారు. సమావేశంలో పులిచింతల ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ వసంత బాబు, జిల్లా హౌసింగ్ పీడీ వేణు గోపాలరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, డి.ఆర్.డి.ఏ పి.డి బాలు నాయక్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబుల్ నాయిడు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వర రావు, ఉద్యాన శాఖ అధికారి బెన్నీ, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఉచితంగా మెటీరియల్

ప్రజాశక్తి-గుంటూరు

మెటీరియల్ పుస్తకాన్ని ఆవిస్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షకు సిద్ధం అవుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన మెటీరియల్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కెఎస్ లక్ష్మణరావు కుమార్తె, కుమారుడు క్యూరీ, అలీన్ సౌజన్యంతో ప్రభుత్వ విద్యార్థుల కోసం మెటీరియల్ రూపొందించటం అభినందనీయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మీడియాతో మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధిస్తే నాలుగేళ్లపాటు రూ.12వేలు చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందని, పేద విద్యార్థులకు ఇది బాగా ఉపయోగపడుతుందన్నారు. 180 మార్కుల ప్రశ్నా పత్రంలో 90 మార్కులు మెంటల్ ఎబిలిటీ అంశానికి కేటాస్తారని, అయితే 8వ తరగతి విద్యార్థులకు వారి సబ్జెక్టులలో ఎక్కడా ఈ అంశం ఉండనందున వారి కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు చెప్పారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో సుమారు 10వేల కాపీలు విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నా మన్నారు. విద్యార్థులు మెటీరియల్‌ను వినియోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం లక్ష్మణరావు, వారి పిల్లలు కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్, ఉర్దూ డిఐ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.